❖•❖•❖ 27 ❖•❖•❖

# గబ్బతా

*"పిలాతు ఈ మాటలు విని, యేసును బయటికి తీసికొనివచ్చి, రాళ్లు పరచిన స్థలమందు న్యాయపీఠము మీద కూర్చుండెను. హెబ్రీ భాషలో ఆ స్థలమునకు గబ్బతా అని పేరు ... పిలాతు – 'మీ రాజును సిలువవేయుదునా?' అని వారిని అడుగగా ప్రధానయాజకులు – కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడనిరి. అప్పుడు సిలువవేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను" (యోహాను 19:13-16).*

పిలాతు యేసును గూర్చిన తన తుది తీర్పును ప్రకటించుటకు దారితీయుచుండిన సంఘటనలు, అవి జరుగవలసి యుండిన విధంగా అనగా, పరీక్షించిన తరువాత రుజువుల బలాబలాలను తూచుచు తీర్పును ప్రకటించుట, ముక్కుసూటిగా వెల్లడించలేదు. దానికి బదులుగా, తీర్మానాలు ప్రకటింపబడుట వాటికి ప్రతిస్పందనగా కేకలు వేయబడుట, తెగింపుతో కూడిన కదలికలకు ప్రతికూల కదలికలు చేయబడుట, చివరకు పిలాతు మరణ శిక్ష వైపే మొగ్గుచూపు నిర్ణయాన్ని ప్రకటించునట్లు బలాత్కారముచేయబడునంతవరకు, కాలచక్రం వంకరటింకరగా తిరిగింది.

పిలాతు ఏది చేసినా ఏమి చెప్పినా అది సిద్ధించుటలేదు. యూదుల పస్కాపండుగ వాడుక చొప్పుననే, యేసు మీద మోపబడిన నేరాల విషయములో ఆయన నిర్దోషియని ప్రకటించి ఆయనను విడుదల చేయునని చెప్పినప్పుడు, వారందరు యేసుకు బదులుగా బరబ్బను కోరుకొన్నారు. అప్పుడు, యేసు విషయములో తన స్పష్టమైన తీర్పు ఏమిటో విదితంగా ప్రకటించునట్లు, ఆయన యేసు రక్తము గూర్చి నిరపరాధియని ప్రజలందరికి ప్రకటిస్తూ వారి యెదుటనే నీళ్లు తీసుకొని పళ్లెములో తన చేతులు కడుగుకొన్నాడు. ఈ క్రతువు ప్రజలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు; గనుక యేసు మరణమును గూర్చిన బాధ్యతను స్వీకరించుటకు వారు తక్షణమే అంగీకరించారు. తీర్పు ఈ విధంగా కొనసాగుచుండిన సమయంలో, యేసు విడుదల గూర్చి పిలాతు ప్రధాన యాజకులతో వాదోపవాదములను కొనసాగించుచుండినప్పటికిని, ఆయన కొరడాలతో కొట్టబడుటకు సెలవిచ్చాడు. కొరడాలతో కొట్టించిన తరువాత, వారి సానుభూతిని సంపాదించుకొనగలడని ఆశిస్తూ, రక్తసిక్తమై

యుండి శరీరమంతా గాయములతో నిండిన, యేసును వారి యెదుట నిలువబెట్టాడు. కూడి యుండిన ప్రజలంతా దయనీయమైన స్థితిలో నుండిన వాని యెడల దయకు బదులుగా ద్వేషముతో బిగ్గరగా ఘోషించారు. వారు యేసుకు వ్యతిరేకమైన కేకలు వేసారు: "మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెను" (యోహాను 19:7 చూడుము). వారు పలుకుచుండిన మాటలు విన్న పిలాతు భయపడిపోయి, యేసుతో మరొకసారి మాటలాడుటకు పిలాతు ఆయనను అధికారమందిరములోనికి తీసుకొనివెళ్లాడు. దైవత్వమును గూర్చిన ఈ ప్రశ్న పిలాతు హృదయంలో కలవరమును కలుగజేసింది. అయితేనేమి పిలాతు మాత్రం యేసు మాటల్లోను చేతలోను విశదంగా వ్యక్తమైన విశిష్టతను గమనించాడు.

యేసు ఆయనతో చెప్పిన సమాధానముల ద్వారా కొంత సత్తువను సంపాదించుకొన్న పిలాతు, వెలుపల వేచియుండిన యూదుల యొద్దకు వెళ్లి యేసులో ఆయనకు ఏ దోషము కనబడలేదని వారికి గుర్తుచేశాడు. "ఈ మాటనుబట్టి (అనగా, ఆయన యేసుతో జరిపిన సంభాషణనుబట్టి) పిలాతు ఆయనను విడుదల చేయుటకు యత్నము చేసెను." అయినప్పటికిని, అంతకు మునుపు ఉత్వేగంతో జరిగినట్లుగానే, పిలాతు పెడచెవిని పెట్టాడు. "యూదులు – నీవు ఇతని విడుదలచేసితివా కైసరునకు స్నేహితుడవు కావు: తాను రాజునని చెప్పుకొను ప్రతివాడును కైసరునకు విరోధముగా మాటలాడుచున్నవాడే ..." అని వాక్యభాగము చెప్పుచున్నది (యోహాను 19:12). "కైసరునకు స్నేహితుడవు కావు" అను మాటలు, మండుచున్న అగ్ని బాణమువలె, పిలాతు హృదయంలోనికి దూసుకపోయింది. ఈ సమయంలో పిలాతు, "నేను చేయగలిగినదంతా చేశాను. నాలో యిక సహనంగాని శక్తిగాని ఏమీ మిగుల లేదు" అని తన మనస్సాక్షికే చెప్పుకొనునట్లు ఒత్తిడి చేయబడ్డాడు.

రోమా ప్రభుత్వము మరియు కూడుకొనియుండిన జనసమూహము ఏమి చేయునో యను భయంచేత కంపించుచు, పిలాతు హృదయం, యిక దేనినీ తట్టుకొనలేకపోయింది. ఆయన ఈ గలిలయుని ప్రతిరక్షించునట్లు ఆయనను సమర్థించాడు, కానీ యేసు నిమిత్తము ఆయన సమస్తమును త్యాగంచేయలేకపోయాడని ఆయన నమ్మాడు. చెలరేగనైయుండిన అల్లకల్లోలము ఆరంభమగుచుండినది. తన జీవితములోనికి ఒక స్వేచ్ఛను తీసుకరానైయుండిన వైపరీత్యము – మరియు ప్రస్తుత పరిస్థితిని అదుపుచేయుటలో విఫలుడైనట్లయితే ఆయన రోమా ప్రభుత్వము నుండి ఎదుర్కొనగల సమస్యలు – ఈ అత్యంత కీలకమైన క్షణములో ఆవశ్యకమై యుండిన సాహసము, యథార్థమైన నాయకత్వము, మరియు నైతిక న్యాయవర్తనము కొరకు ఆయన చెల్లించాల్సిన మూల్యమునకు యోగ్యమైనవిగా అగుపించలేదు. కాబట్టి, అసలుసిసలైన విలువగల వాటినన్నింటిని వదలి రాజీపడు ముసుగులోనికి పరుగెత్తాడు.

ఈ నిర్ణయంతో, చివరకు యేసు తీర్పు దాని చివర దశకు చేరుకొన్నది, తీర్పు యొక్క అంత్య క్షణములలో సంభవించిన సంఘటనలను అత్యంత విశదంగా నివేదించిన యోహాను,

> పిలాతు ఈ మాటలు విని, యేసును బయటికి తీసికొనివచ్చి, రాళ్లు పరచిన స్థలమందు న్యాయపీఠము మీద కూర్చుండెను. హెబ్రీ భాషలో ఆ స్థలమునకు గబ్బతా అని పేరు. ఆ దినము పస్కాను సిద్ధపరచు దినము; అప్పుడు ఉదయము ఆరుఘంటలు కావచ్చెను.

> అతడు – "ఇదిగో, మీ రాజు!" అని యూదులతో చెప్పెను. అందుకు వారు – "ఇతనిని సంహరించుము, సంహరించుము సిలువ వేయుము!" అని కేకలు వేసిరి. పిలాతు – "మీ రాజును సిలువ వేయుదునా?" అని వారిని అడుగగా ప్రధానయాజకులు – "కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడనిరి." అప్పుడు సిలువవేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను అని చెప్పుచున్నాడు (యోహాను 19:13–16).

పిలాతు ఒక ప్రాచీన ఏథేనీయుల ప్రజా సమితిని, ఎత్తుగా నిర్మించబడిన ఒక భావవేదికను, జనసామాన్యానికి అగుపించు బహిరంగ వేదికను ప్రేతోర్యమునకు వెలుపల ఏదో ఒక చోట "చప్టా" అని పిలువబడిన స్థలములో ఏర్పాటు చేశాడు. "చప్టా" అను ఈ గ్రీకు పేరుకు (*lithostrotos*) "రాళ్లతో చదునుగా పేర్చబడిన" అని అర్థము. ఈ స్థలము "గబ్బతా" అనగా, హెబ్రీ భాషలోని పదము "గట్టు" అని అర్థమిచ్చునదిగా పిలువబడినదని చెప్పుచూ యోహాను ఈ స్థలమును గుర్తించుచున్నాడు. ఎఫ్. ఎఫ్. బ్రూస్ ఈ చోటునకును అంతోనియా కోటలో గల ఆవరణములోని ఒక చోటునకును సంబంధమున్నదని తెలియజేస్తూ ఇలా వ్రాస్తున్నాడు.

> ఈ స్థలము తరుచుగా, మౌలికముగా దాదాపు 3,000 చదరపు అడుగుల కొలత కలిగి, ఆంతోనియా కోటలోని ఆవరణమని గుర్తింపబడిన Ecce Homo arch కాన్వెంటు Our Lady of Zion క్రింద త్రవ్వబడిన ఒక మహాత్యమైన రోమా చపటాతో గుర్తింపబడుచున్నది.[1]

సరైన సమయానికి, ఆ భావవేదికపై ఆసీనుడై, పిలాతు యేసును గూర్చిన తన తీర్పును ప్రకటిస్తాడు. ఊదారంగు బట్టలు పర్చబడిన ఆసనములో, ప్రభుత్వ అధికారిక పదవి చొప్పున ఆసీనుడై, ఆయన యేసు కేసును గూర్చిన తన తుది తీర్పును బహిరంగంగా ప్రకటిస్తాడు.

ఈ తీర్పులో ఆయన పోరాడిన పోరాటము ఎంత తీవ్రమైనదైయుండినదంటే, ఈ తీర్పు గూర్చి పలుకబడుచుండిన మాటల వలన ఆయన మనస్సు ఎంత గంభీరంగా అలజడి చెందినదంటే, తన తీర్పును ప్రకటించుటకు మునుపు ఒక చిట్టచివరి సంజ్ఞ చేయుట ఆయనకు తప్పనిసరైంది. తన చెయ్యిని ఊపుతూ, ఆయనకు ముందర నిలువబడి యున్నవారితో, "ఇదిగో, మీ రాజు!" అని చెప్పాడు. ఈ నాటకీయమైన మాటలు "ఇదిగో, ఈయన ఇక్కడే ఉన్నాడు. ఈయన మీ రాజు మీరు నిజంగా మీ రాజును సిలువవేస్తారు?" అని వారితో చెప్పినట్లు అగుపించాయి. ఆయన తుది విన్నపమునకు మానవ చరిత్రలోని అతి దుఃఖకరమైన ప్రతిస్పందనలభించింది. విషపూరితమైన పెద్ద గోలతో: "వానిని సంహరించుము, వానిని సంహరించుము, వానిని సిలువవేయుము!" ఆయన చెవులు చితకబాదబడినట్లయిపోయాయి.

రాజైన యేసు – దేవుడెలా ఉంటాడో మనకు చూపించుచు, మన పాపముల కొరకు మరణించుట ద్వారా, మనకు నిత్యజీవము నిచ్చుటకువచ్చినవాడు – తీర్పుకు గురియగునట్లు పన్నాగము పన్నుటకు కలిసికట్టుగా సమ్మతించినవారిచేత సంపూర్తిగా తృణీకరింపబడ్డాడు. "మీ రాజును నేను సిలువవేయవలెనా?" అని పిలాతు తన జవాబు వారికి బిగ్గరగా వినిపించునట్లు అరచియుంటాడు. ఈ ప్రశ్నకు, ప్రధానయాజకులు, "మాకు కైసరు తప్ప మరొక రాజు లేడు" అని వెంటనే సమాధానమిచ్చారు. ఈ క్లుప్త సంభాషణ తరువాత, తీర్పు గూర్చిన చిట్టచివరి వివరణాత్మకమైన మాటలు చెప్పబడినవి: "అప్పుడు సిలువవేయబడుటకై అతడాయనను వారికి

అప్పగించెను" (యోహాను 19:16). ఆ నిమిషము నుండి, గబ్బతా యుగములన్నిటిలోని చిరస్మరణీయమైన ఒక ప్రధానాంశముగా జ్ఞాపకముంచుకొనబడుచున్నది.

*గబ్బతా ఒక ఓటమి స్థలమై యున్నది.* పిలాతు, ఒక పౌర ప్రభుత్వాధికారిగా, న్యాయముతో వ్యవహరించి న్యాయసమ్మతమైన తుది తీర్పునిచ్చుటకు యత్నించినప్పుడు, ఆయన విఫలుడయ్యాడు. యూదా నాయకులు వారి స్వంత మతమును కాపాడుకొనవలెనని యత్నించినప్పుడు, వారు పూర్వాభిప్రాయము, అసూయ, మరియు అత్యంత అసభ్యకరమైన పాపములచేత కమ్ముకొనబడినవారయ్యారు. యేసు సిలువవేయబడవలెనని వేయబడుచుండిన అల్లరితో కూడిన పెద్ద కేకలనుబట్టి ఆయన యేసును సిలువవేయబడుటకు అప్పగించుచున్నాడని పిలాతు చేసిన ప్రకటన మానవుడు వాని చుట్టూర ఉన్న పరిస్థితుల చేత అదువుచేయబడుచు తనను తాను దైవీకమైన మార్గనిర్దేశనమునకు విధేయతతో అప్పగించుకోనప్పుడు వానిపై వచ్చిపడగల విషాదాంతమును సూచించింది.

*గబ్బతా విజయభేరి మ్రోగిన స్థలమై యుండినది.* అన్న, కయప యూదుల మహా సభాసభ్యులైన ప్రధాన యాజకులు, మరియు యెరూలేములోని యూదా నాయకత్వము క్రింద నడుచుకొనుచుండిన జనసమూహము యేసును వదిలించుకొనవలెనని బయలుదేరారు. వారి సమస్త మానసిక మరియు శారీరక శక్తులతో, అబద్ధ సాక్షులను తీసుకొని వచ్చి, యేసు మాటలను వక్రీకరించి, వారి కోరికల ఒత్తిడులకు పిలాతు లోబడునట్లు ఆయనను ఉపయోగించుకొంటూ, వారు కుట్ర పన్నారు. పిలాతు యేసును వారి కప్పగించినప్పుడు వారు, "మేమనుకున్నది సాధించాము!" అని కేకలువేశారు. అది ఒక ప్రక్క విజయము మరొక ప్రక్క ఓటమి ఎదురైన రోజై యుండినది – దుర్మార్గులకు విజయము మరియు న్యాయము పక్షంగా ప్రాతినిధ్యంవహించి పోరాడిన వారికి ఓటమి.

*గబ్బతా ఒక దైవవిధి స్థలమై యుండింది.* పిలాతు చేసిన మరియు మేము అనుకున్నది సాధించామని యూదా నాయకత్వము అనుకొన్న దాని వెనుక దేవుని ప్రణాళిక కలదు. మానవుడు సిలువమరణము వెనుక దురుద్దేశము గలిగియుండెను, కానీ దేవుడు దానిని మంచి కొరకే అనుమతించాడు. యేసు యెరూషలేము వెళ్లుటకు అభిముఖుడైనప్పుడు, ఆయన ఆ చోటును మరియు ఆ సమయమును తన బలియాగముకొరకు ఏర్పరచుకొనుచుండెను. యేసు తన సిలువ శ్రమల గూర్చి తన శిష్యులకు అత్యంత విశదముగా ముందుగానే వివరించిన దానిలో, ఆయన ఇలా చెప్పాడు.

> ఇదిగో, యెరూషలేమునకు వెళ్లుచున్నాము; అక్కడ మనుష్యకుమారుడు ప్రధానయాజకులకును శాస్త్రులకును అప్పగింపబడును; వారాయనకు మరణశిక్ష విధించి ఆయనను అపహసించుటకును కొరడాలతో కొట్టుటకును సిలువవేయుటకును అన్యజనులకు ఆయనను అప్పగింతురు; మూడవ దినమున ఆయన మరల లేచును (మత్తయి 20:18, 19).

పేతురు ఆ తరువాత ఇలా చెప్పాడు, "అయితే దేవుడు తన క్రీస్తు శ్రమపడునని సమస్త ప్రవక్తలనోట ముందుగా ప్రచురపరచిన విషయములను ఈలాగు నెరవేర్చెను" (అపొస్తలుల కార్యములు 3:18).

యేసు గెత్సేమనే తోటలో నుండి గబ్బతా అను చోటికి, ప్రార్థన చేసిన చోట కలిగిన దుఃఖములో నుండి ప్రేతోర్యమను చోట తృణీకరింపబడుటకు వెళ్లాడు. ఇక ఇప్పుడు తనను

తాను పాపపరిహారార్థ బలిగా అర్పించుకొనుటకు గొల్గొతాకు వెళ్లనైయున్నాడు. అక్కడ నుండి, ఎక్కడైతే ఆయన తన మరణము ద్వారా సాధ్యము చేసిన నిత్య జీవమును తన స్వంత పునరుత్థానము చేత రూఢిపర్చనైయున్నాడో ఆ తోటలోని సమాధికి వెళ్లాడు. ఆయన నామము స్తుతింపబడునుగాక! హల్లేలూయ, ఎంత గొప్ప రక్షకుడు!

❖◆❖◆❖

*"ఒక విధంగా కాకపోయినా ఏదో ఒక విధంగా, జీవితములోని సమస్త మంచి ఈవులు బలియాగము చేయుట ద్వారా వాటి మూల్యము చెల్లింపబడుచున్నవే ... ఎంతో – ఎవరో ఒకరి పాటు చేత మరియు ఆత్మత్యాగముతో ఎంతో మూల్యము చెల్లించి కొనబడినవై యున్నవి ...*

*"సిలువ సందేశమును నిర్దిష్టంగా చదివిన, విశ్వాసము గల స్త్రీ గాని పురుషుడు గాని, కలువరి గిరి ఒక వింతైన పవిత్రతను, వర్ణింప శక్యముకాని అందమును, జీవితమంతటిలో కలుగజేస్తుందని అనుభవపూర్వకంగా గ్రహిస్తారు. మన కుటుంబాలు సురక్షితంగా ఉంటున్నవి, మన వివాహాలు ఆనందభరితమైనవై యుంటున్నవి, మన పిల్లలు ఆరోగ్యవంతులై యుంటున్నారు, మన ఆహారము రుచికరమైనదై యుంటున్నది, మన నవ్వు ఆర్థికమైనదై యుంటున్నది, మన సాహిత్యము విశిష్టమైనదై గర్వించేదిగా ఉంటున్నది, మన పాటలు సంతోషకరమైనవై యుంటున్నవి, మన ప్రపంచమే సంపన్నమైనదై యుంటున్నది – ఇదంతా కూడ ఎక్కడైతే మన ప్రియ ప్రభువు మన కొరకు తన ప్రాణమును ధారపోసాడో ఆ 'దూరములో నున్న కొండపై' నుండి ప్రసరించుచుండు వెలుగు వలననే కలుగుచున్నది."[2]*

---

సూచనలు

[1]F. F. Bruce, *The Gospel of John* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1983), 364. [2]Paul Stromberg Rees, *The Radiant Cross* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1955), 18-19.